సాక్షి
అనకాపల్లి
బుధవారం । 5 । జూలై । 2023



న్యూస్‌రీల్

ఉపాధ్యాయిని రచనకు కొలకలూరి ఇనాక్ జాతీయ పురస్కారం


పురస్కార గ్రహీత స్వాతి

మాకవరపాలెం: భీమబోయినపాలెం గ్రామానికి చెందిన సన్నిధి స్వాతి కొలకలూరి ఇనాక్ జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారు. ఆమె ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయినిగా పనిచేస్తూ కవితలు రాస్తారు. తాను రాసిన మౌన మేఘాలు కవితకు జాతీయస్థాయి అవార్డు లభించినట్టు చెప్పారు. ఈనెల 9న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పురస్కారం అందుకోనున్నారు. ఆమెను గౌతమి లలిత కళాశిక్షణ కేంద్రం అధ్యక్ష, కార్యదర్శులు రంగరాజు, శేషగిరిరావు తదితరులు అభినందించారు.

రూ.7.2 కోట్లతో బొజ్జన్నకొండపై మౌలిక వసతులు

అనకాపల్లిటౌన్: అనకాపల్లి మండలంలోని బొజ్జన్నకొండ అభివృద్ధికి కేంద్రం రూ.7.2 కోట్లు నిధులు విడుదల చేసిందని ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది డిశంబర్ నాటికి పనులు పూర్తిచేసేందుకు చర్యలు చెపట్టనున్నట్టు పేర్కొన్నారు. బొజ్జన్నకొండ వద్ద పర్యాటకులు రాత్రి సమయంలో బసచేసేందుకు వీలుగా మౌలిక సదుపాయలు, రహదారి నిర్మాణానికి ఈ నిధులు వెచ్చించనున్నట్లు తెలిపారు. మౌలిక సదుపాయాల ఏర్పాటుకు ఇప్పటికే స్థల సేకరణ జరిగిందన్నారు. త్వరతగతిన పనులు పూర్తి చేసి, మరింతగా పర్యాటకుల్ని ఆకట్టుకునేలా బొజ్జన్నకొండను తీర్చిదిద్దనున్నట్లు పేర్కొన్నారు.

సర్వేయర్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మాకవరపాలెం: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ (నాక్) ఆధ్వర్యంలో ఉచిత సర్వేయర్ శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు నాక్ అసిస్టెంట్ డైరెక్టర్ రవికుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మాకవరపాలెం బీసీ కాలనీలో ఉన్న హాస్టల్ భవనంలో శిక్షణ ఉంటుందన్నారు. 60 సీట్లు ఖాళీగా ఉన్నాయని, పదో తరగతి పూర్తి చేసిన 15–45 ఏళ్లలోపు వారు అర్హులన్నారు. సర్వేయర్ శిక్షణ అనంతరం ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ఇతర వివరాలకు 7780374625 నంబర్‌ను సంప్రదించవచ్చన్నారు.

మహిళా రైతు సాహసం

- కాటేయబోయిన ఆరడుగుల విషసర్పం హతం


హతమార్చిన సర్పంతో నాళం రమణమ్మ

దేవరాపల్లి: పెదనందిపల్లి గ్రామానికి చెందిన నాళం రమణమ్మ అనే మహిళా రైతు సాహసించి సుమారు ఆరడుగుల పొడవున్న విషసర్పాన్ని కర్రతో కొట్టి హతమార్చింది. మంగళవారం పశువులకు ఎండు గడ్డి వేస్తుండగా అందులో ఉన్న పాము ఒక్కసారి బుసలు కొడుతూ కాటేయబోయింది. త్రుటిలో తప్పించుకున్న ఆమె సమీపంలో ఎవరూ లేకపోవడంతో ధైర్యం చేసి కర్రతో కొట్టి హతమార్చింది. రమణమ్మ తెగువను చూసి సమీప రైతులు మెచ్చుకున్నారు.


మోస్తరు వర్షసూచన

అనకాపల్లి టౌన్: రాగల ఐదు రోజులు మోస్తరు వర్షసూచన ఉందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త ఎంబీజీఎస్ కుమారి మంగళవారం పేర్కొన్నారు. ఈనెల 5న 15 మి.మీ., 6న 23, 7న 12, 8న 2, 9న 3 మి.మీ. చొప్పున వర్షపాతం నమోదవుతుందని, ఉష్ణోగ్రతలు 33.4 నుంచి 36.2 డిగ్రీలు, తేమ 72 నుంచి 82 శాతం, గాలి గంటకు 8 నుంచి కిలోమీటర్ల వేగంతో వీస్తుందన్నారు.

విషమంగానే నూకినాయుడు ఆరోగ్యం

మహారాణిపేట (విశాఖ): అచ్యుతాపురం సాహితీ ఫార్మా పరిశ్రమలో జరిగిన అగ్ని ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నూకినాయుడు పరిస్థితి విషమంగా ఉంది. గత నెల 30న అచ్యుతాపురం సాహితీ ఫార్మా పరిశ్రమలో గాయపడ్డ ఆయనను చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. సీఎస్ఆర్ బ్లాక్‌లో చికిత్స పొందుతున్న నూకినాయుడు పరిస్థితి విషమంగా ఉందని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ తెలిపారు. కిడ్నీ ఫెయిల్యూర్, ఇతర అవయవాలు పనిచేయకపోవడంతో వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నామన్నారు.

రేటు వెరీ 'గుడ్డు'!



సాక్షి, విశాఖపట్నం: ఎండలతో పాటే కోడిగుడ్డు ధర కూడా ఎగబాకింది. ప్రస్తుతం వంద గుడ్ల రేటు రూ.515 పలుకుతోంది. నిన్న మొన్నటి వరకు ఈ సీజనులోనే అత్యధికంగా వీటి ధర రూ.550 ఉంది. నెల రోజుల క్రితం జూన్ ఒకటో తేదీన విశాఖపట్నంలో వంద కోడిగుడ్ల రేటు రూ.510 ఉండేది. అలా క్రమంగా పెరుగుతూ జూన్ 15 నాటికి రూ.550కి చేరుకుంది. దాదాపు 20 రోజుల పాటు అదే ధర కొనసాగింది. మంగళవారానికి రూ.35 తగ్గి రూ.515కి దిగి వచ్చింది. మార్కెట్లో రిటైల్‌గా ఒక్కో గుడ్డు రూ.6 చొప్పున విక్రయిస్తున్నారు. వంద గుడ్ల ధర రూ.550 ఉన్నప్పుడు విడిగా రూ.7కి అమ్మేవారు. గుడ్ల ధరలు పెరగడానికి కొన్ని నెలలుగా కాస్తున్న ఎండలు, వడగాడ్పులు కారణమని కోళ్ల పెంపకందార్లు చెబుతున్నారు.

వడగాడ్పుల తీవ్రతకు కోళ్లు చనిపోతుంటాయి. అలాగే వేసవి తాపానికి ఫారాల్లోని కోళ్లు సరిగా మేత తినవు. దీంతో 10 శాతం వరకు గుడ్ల ఉత్పత్తి కూడా తగ్గిపోతుంది. ఫలితంగా డిమాండ్‌కు సరిపడా గుడ్ల లభ్యత లేక వీటి ధర పెరగడానికి కారణమవుతుందని పౌల్ట్రీ రైతులు పేర్కొంటున్నారు.

ఎండల తీవ్రత తగ్గితే మళ్లీ గుడ్ల ఉత్పత్తి పెరుగుతుందని చెబుతున్నారు. మరోవైపు ఉత్తరాంధ్రలోని కోడిగుడ్లపై కోల్‌కతా బహిరంగ మార్కెట్ ప్రభావం ఉంటుంది. అక్కడ మార్కెట్‌కు ఇతర రాష్ట్రాల నుంచి గుడ్లు ఎక్కువగా వస్తే ధర తగ్గుతుందని, ఆ ప్రభావం ఇక్కడ కూడా పడుతుందని వీరు అంటున్నారు. ప్రస్తుతం వేసవి తీవ్రత తగ్గుముఖం పడుతోందని, దీంతో క్రమంగా కోడిగుడ్ల ఉత్పత్తి ఊపందుకుంటుందని, ఫలితంగా రానున్న రోజుల్లో వీటి ధర ఇంకా తగ్గే అవకాశం ఉందని నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ (నెక్) జాతీయ కార్యవర్గ సభ్యుడు భరణికాన రామారావు ‹సాక్షి›కి చెప్పారు.

రోజుకు 40 లక్షల గుడ్ల వినియోగం

ఉత్తరాంధ్రలో వివిధ పౌల్ట్రీల్లో పెరుగుతున్న కోళ్ల ద్వారా రోజుకు సగటున 50 లక్షల కోడిగుడ్ల ఉత్పత్తి జరుగుతుంది. వీటిలో 40 లక్షల గుడ్లు అంటే 80 శాతం వరకు స్థానికంగానే వినియోగమవుతాయి. మిగిలిన 20 శాతం ఒడిశా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు ఎగుమతి అవుతుంటాయి. దాదాపు నెల రోజులుగా కోడిగుడ్ల ధరలు సామాన్యుడికి అందుబాటులో లేకుండా పోయాయి. హోల్‌సేల్‌గా వంద గుడ్లు రూ.550 ధర కొనసాగింది. దీంతో రిటైల్ మార్కెట్లో విడిగా ఒక్కో గుడ్డు రూ.7 చొప్పున విక్రయించడంతో ఈ ధర మధ్య తరగతి వారికి భారంగా మారింది. అయితే ప్రస్తుతం గుడ్డు ధర దిగివస్తుండడం వీరికి కాస్త ఉపశమనం కలిగిస్తోంది. పౌల్ట్రీ రైతులు మాత్రం ఇంతకన్నా ధర తగ్గితే తాము నష్టపోతామని చెబుతున్నారు.

రంగురాళ్ల క్వారీల భద్రతపై పీసీసీఎఫ్‌కు నివేదిక

- స్టేట్ విజిలెన్స్ డీఎఫ్‌వో రవిశంకర్ శర్మ


విచారణ నిర్వహిస్తున్న విజిలెన్స్ డీఎఫ్‌వో

నర్సీపట్నం/గొలుగొండ: రంగురాళ్ల క్వారీల వద్ద భద్రత పెంచాల్సిన అవసరం ఉందని పీసీసీఎఫ్‌కు ఇచ్చిన నివేదికలో పేర్కొన్నట్టు అటవీశాఖ స్టేట్ విజిలెన్స్ డీఎఫ్‌వో రవిశంకర్‌శర్మ తెలిపారు. గొలుగొండ మండలం సాలికమల్లవరం ఫారెస్టులో తవ్వకాలు జరుగుతున్నట్టు లోకాయుక్తకు అందిన ఫిర్యాదుపై పీసీసీఎఫ్ ఆదేశాల మేరకు విచారణ జరిపామని ఆయన తెలిపారు. నర్సీపట్నంలోని డీఎఫ్‌వో కార్యాలయంలో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. క్షేత్రస్థాయి పరిశీలనతో పాటు అటవీ సిబ్బందిని కూడా విచారిస్తున్నామన్నారు. రంగురాళ్ల క్వారీల వద్ద నిఘా పెంచాల్సిన అవసరం ఉందని తన నివేదికలో పేర్కొన్నట్టు తెలిపారు. ఆయన సాలికమల్లవరం గ్రామ పరిధిలో ఉన్న రంగురాళ్ల క్వారీ ప్రాంతాన్ని పరిశీలించారు.

ఆదర్శనీయం అల్లూరి మహోద్యమం


అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాల వేస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి


సీతారామరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎస్పీ మురళీకృష్ణ


అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన మంత్రి అమర్‌నాథ్

తుమ్మపాల/అనకాపల్లిటౌన్ : అల్లూరి ఆదర్శాలను స్ఫూర్తిగా తీసుకుని బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి యువత కృషి చేయాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణలు పిలుపునిచ్చారు. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 126వ జయంతి సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలో, ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమాల్లో వారు పాల్గొని అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అణచివేతకు గురవుతున్న గిరిజనుల పక్షాన బ్రిటిష్‌వారితో పోరాడి, స్వాతంత్ర్య పోరాటంపై మన్యం ప్రజలలో అవగాహన కల్పించి విప్లవం లేవదీశారన్నారు. అదే లక్ష్యంతో అందరికి ఉపయోగపడేలా ప్రతి యువత మన గ్రామం, మన జిల్లా, మన రాష్ట్రానికి మంచి చేసేలా కృషి చేయాలన్నారు. ఎస్పీ కె.వి.మురళీకృష్ణ మాట్లాడుతూ సీతారామరాజు గిరిజనుల హక్కుల గురించి తెలిపి, వారిలో స్వాతంత్ర్య కాంక్ష రగిలించారని వివరించారు. ప్రతి ఒక్కరు మన్యంలో జరిగిన ఉద్యమం తీరును తెలుసుకోవాలన్నారు. అలాంటి మహావీరుల సేవలు, దేశభక్తి స్మరించుకుంటూ వారి బాటలో నడవాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్వో పి.వెంకటరమణ, అడిషనల్ ఎస్పీ బి.విజయభాస్కర్, జిల్లా క్రైం ఎస్పీ పి.సత్యనారాయణరావు, నర్సీపట్నం అడిషనల్ ఎస్పీ అభిరాగ్‌సింగ్‌రాణా, ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ పి.శ్రీనివాసరావు, ఇన్‌స్పెక్టర్లు చంద్రశేఖర్, పైడపునాయుడు, అప్పలనాయుడు, నీలయ్య, ఏటీడబ్ల్యూవో నాగశిరీష, ఏబీసీడబ్ల్యూవో సురేష్, గిరిజన సంక్షేమ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

పోరాట యోధుడు అల్లూరి

అనకాపల్లిటౌన్: మండలంలో తుమ్మపాల గ్రామంలో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు, వంగవీటి మోహనరంగా జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సీతారామరాజు విగ్రహానికి, రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి అమర్‌నాథ్ మాట్లాడుతూ బ్రిటీష్ పాలకుల గుండెల్లో దడ పుట్టించిన పోరాట యోధుడిగా అల్లూరిని కీర్తించారు. కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్, పార్టీ నేతలు పాల్గొన్నారు.

మరోసారి.. గెలుపు దారి..


విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్

- వైఎస్సార్‌సీపీ విజయదుందుభి ఖాయం
- త్వరలో 26 అనుబంధ కమిటీల నియామకం
- పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్

అనకాపల్లి టౌన్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కూడా వైఎస్సార్‌సీపీ 2019నాటి జోరు కొనసాగించి, విజయదుందుభి మోగిస్తుందని పార్టీ జిల్లా అధ్యక్షుడు, గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ చెప్పారు. రింగ్‌రోడ్డులోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజల నుంచి పుట్టిన వైఎస్సార్‌సీపీని మరోసారి గెలిపించాలని జనం బలంగా కోరుకుంటున్నారన్నారు. గ్రామీణ స్థాయి నుంచి అన్ని వర్గాల సహకారంతో పార్టీని మళ్లీ అధికారంలోకి తీసుకొస్తామన్నారు. త్వరలో జిల్లా స్థాయిలో పార్టీ 26 అనుబంధ కమిటీలను నియమిస్తున్నట్లు చెప్పారు. పార్టీ జెండాను చేతబట్టిన ప్రతి వ్యక్తికి గుర్తింపు వచ్చే విధంగా కృషి చేస్తానని చెప్పారు. నియోజకవర్గంలో ఏడుగురు ఎమ్మెల్యేలు, ఇద్దరు మంత్రులు, ఒక ఎంపీ సహకారంతో అనుబంధ కమిటీలను త్వరలో పార్టీ రీజినల్ కోఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తామన్నారు. అంతేకాకుండా జిల్లా స్థాయి విస్తృత సమావేశం ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

బాబు కపట ప్రేమను జనం నమ్మరు

గాంధీజీ కలలు కన్న గ్రామస్వరాజ్యం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో కార్యరూపం దాల్చిందని బొడ్డేడ అన్నారు. రాష్ట్రంలో బీసీలకు వెన్నుపోటు పొడిచిన చంద్రబాబును ప్రజలు నమ్మే పరిస్థితి లేదని, ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో చంద్రబాబు, లోకేష్‌లు బీసీలపై ప్రేమ చూపిస్తున్నా ఫలితం లేకుండా పోతుందన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల వల్ల రాష్ట్రం మరో శ్రీలంకగా మారుపోతుందని చెప్పిన చంద్రబాబు.. మహానాడు సభలో మేనిఫెస్టో విడుదల చేసి హామీలు గుప్పించడం సిగ్గుచేటన్నారు. సీఎం జగన్‌తోపాటు, ఇతర రాష్ట్రాల్లో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చంద్రబాబు కాపీ కొట్టడం హాస్యాస్పదంగా ఉందన్నారు. బీసీ కులాలకు 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. దొంగ ఓట్లతో నెట్టుకొచ్చిన చంద్రబాబు అండ్ కోకు వాటి తొలగింపుతో నిద్రపట్టడం లేదని పేర్కొన్నారు. ఈ ఏడాది ఆఖరులోగా రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన లబ్ధిదారులకు 2 లక్షల 60 వేల టిడ్కో గృహాలు ఇచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలిపారు. అంతకుముందు పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ముఖ్యనాయకులతో బొడ్డేడ ప్రసాద్ సమావేశం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు గొర్లి సూరిబాబు, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు ఈర్లె అనురాధ, జిల్లా గ్రీవెన్స్‌సెల్ అధ్యక్షుడు కాండ్రేగుల విష్ణుమూర్తి, పట్టణ సచివాలయాల కన్వీనర్ కొణతాల మురళీకృష్ణ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి పలకా రవి, ఎస్సీసెల్ మహిళా విభాగం అధ్యక్షురాలు ఎల్.సుజాత, ప్రచారదళ్ జిల్లా అధ్యక్షుడు డి.సాయి, వైఎస్సార్‌సీపీ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, మాజీ కౌన్సిలర్ దాడి నారాయణరావు, వివిధ విభాగాల నేతలు పాల్గొన్నారు.

నాడు-నేడు పనులపై నిరంతర పర్యవేక్షణ

- అంగన్‌వాడీ రికార్డుల్లో అవకతవకలుంటే కఠిన చర్యలు
- ఎప్పటికప్పుడు నాణ్యతను పరిశీలించాలి
- మాతా శిశు సంక్షేమశాఖ ఆర్జేడీ చిన్మయిదేవి


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న చిన్మయిదేవి

అనకాపల్లి టౌన్: నాడు-నేడు పథకంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చేపడుతున్న పనులను పర్యవేక్షకులు, సీడీపీవోలు ఎప్పటికప్పుడు తప్పనిసరిగా పర్యవేక్షించాలని మాతా శిశు సంక్షేమశాఖ ఆర్జేడీ జి.చిన్మయిదేవి అన్నారు. స్థానిక అంగన్‌వాడీ జిల్లా కార్యాలయం నుంచి జిల్లాలోని సీడీపీవోలతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్న నాడు-నేడు పనులను వేగంగా పూర్తి చేయాలని, పనుల్లో నాణ్యతను గమనించాలని ఆమె సూచించారు. సూపర్‌వైజర్లు తమ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలను తరచూ ఫీల్డ్ విజిట్ చేయాలని, కేంద్రాల్లో నిర్వహించే రికార్డుల్లో అవకతవకలు లేకుండా చూడాలన్నారు. తేడాలుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆన్‌లైన్ రికార్డులను ఎప్పటికప్పుడు పొందుపరచాలని, సంబంధిత వివరాల నమోదులో తప్పులు లేకుండా చూడాలని కోరారు.

గర్భిణులకు అందజేస్తున్న పోషకాహార వివరాలు, ఎనీమియా, వైద్య పరీక్షల వివరాలను క్షుణ్ణంగా నమోదు చేయాలన్నారు. తేడాలు ఉండరాదన్నారు. ఈ కార్యక్రమంలో పీడీ అనంతలక్ష్మి పాల్గొన్నారు.

హౌసింగ్ సిబ్బంది రక్తదానం


జిల్లా గృహనిర్మాణ సంస్థ కార్యాలయంలో నిర్వహించిన రక్తదాన శిబిరం

తుమ్మపాల: రక్తదానం చేయడం ప్రాణాపాయ స్థితిలో ఉన్న మరొకరికి ప్రాణదానం చేయడమేనని జిల్లా గృహ నిర్మాణ సంస్థ అధికారి కొయ్య రమామణి అన్నారు. ఆంధ్రప్రదేశ్ గృహనిర్మాణ సంస్థ 44వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా గృహ నిర్మాణ కార్యాలయంలో ఎన్టీఆర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిబ్బంది, సచివాలయ ఇంజినీరింగ్ సిబ్బంది సహకారంతో 55 మంది రక్తదానం చేసి నందుకు ఆమె ఆనందం వ్యక్తం చేశారు. జిల్లా అధికారులు చింతాడ కిరణ్‌బాబు, పీవీఎస్ఎన్ఆర్ ప్రసాద్, కాశిబట్ల గౌతమ్ పాల్గొన్నారు.

బడుగులపై పిడుగుల మోత


బాధితుడిని 108లో తరలిస్తున్న దృశ్యం


మృతి చెందిన మేకలను పరిశీలిస్తున్న తహసీల్దార్ మహేశ్వరరావు


రైవాడలో మృతి చెందిన గొర్రెల వద్ద పెంపకదారుడు సత్తిబాబు, కుటుంబ సభ్యులు

- ఒకరి మృతి, మరొకరి గాయాలు
- వేర్వేరు చోట్ల పిడుగుపాటుకు 7 మేకలు, 6 గొర్రెల మృతి

రావికమతం/దేవరాపల్లి: ఈదురు గాలులతో కూడిన వర్షంలో మంగళవారం వేర్వేరు చోట్ల పిడుగులు పడి ఒకరు మరణించగా మరొకరు గాయపడ్డారు. రెండు సంఘటనల్లో 7 మేకలు, 6 గొర్రెలు కూడా మృత్యువాతపడ్డాయి. రావికమతం మండలం కవగుంట సమీపంలో బోర్‌వెల్‌పై పిడుగు పడటంతో పక్కనే ఉన్న కోళ్లవ్యాపారి పొలంలో బోరు తీస్తూ వర్షానికి పక్కన నిల్చున్న ఆపరేటర్ సింగం మండవి(ఒడిశా) మృతి చెందగా, చత్తీస్‌ఘడ్‌కు చెందిన హెల్పర్ సురేష్ కుంజాకు గాయాలయ్యాయి. వీరిని 108లో ఆస్పత్రికి తరలించగా మండవి మృతి చెందినట్టు నిర్ధారించి, కుంజాకు చికిత్స చేసి అనకాపల్లి ఆస్పత్రికి తరలించారు. రావికమతం ఎస్ఐ ఉమామహేశ్వరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

- మత్స్యవానిపాలెంలో మేతకు వెళ్లి వస్తున్న మేకల మందకు సమీపంలో పిడుగు పడటంతో పాతరపల్లి చిరంజీవికి చెందిన 7 మేకలు మృత్యువాత పడ్డాయి. మరి కొన్ని గాయపడ్డాయి.
- దేవరాపల్లి మండలం రైవాడలో పిడుగు పడి ఉగ్రాకుల సత్తిబాబుకు చెందిన 6 గొర్రెలు మృతి చెందాయి. జీనబాడు సమీపంలో మేత కోసం సుమారు 200 గొర్రెలను తీసుకెళ్లారు. సాయంత్రం 5 గంటల ప్రాంతంలో గొర్రెల మందకు సమీపంలో భారీ శబ్దంతో పిడుగులు పడటంతో ఆరు గొర్రెలు అక్కడికక్కడే చనిపోగా, పెంపకదారుడు సత్తిబాబు కాస్తా దూరంగా ఉండంతో సురక్షితంగా బయటపడ్డాడు. మృతిచెందిన గొర్రెల విలువ సుమారు రూ.90 వేలు ఉంటుందని వైఎస్సార్‌సీపీ నాయకుడు ఉగ్రాకుల అప్పారావు తెలిపారు.

అవినీతికి పాల్పడితే సహించేదిలేదు


పాయకరావుపేటలో డిపో నెంబరు 6లో బియ్యం నిల్వలపై డీలర్‌ను ఆరా తీస్తున్న కాంతారావు


పాఠశాలలో జగనన్న గోరుముద్ద రుచి చూస్తున్న కాంతారావు

- ఫుడ్ కమిషన్ సభ్యుడు కాంతారావు

పాయకరావుపేట: రేషన్ డిపో డీలర్లు అవినీతికి పాల్పడితే సహించేదిలేదని, అలాంటివారిపై కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు బి.కాంతారావు హెచ్చరించారు. మంగళవారం ఆయన పట్టణంలో పర్యటించి రేషన్ డిపోలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్ని తనిఖీ చేశారు. ఎంఎల్ఎస్ పాయింట్‌ను తనిఖీ చేసి, బియ్యం నిల్వలను అడిగి తెలుసుకున్నారు. అంతా సక్రమంగా ఉందని సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం డిపో–1, డిపో–4, డిపో–6, డిపో–40లను తనిఖీ చేశారు. రికార్డులను, నిల్వలను పరిశీలించారు. డిపో–6లో ఉండాల్సిన దానికన్నా ఎక్కువ బియ్యం నిల్వ ఉండటాన్ని గమనించారు. వీవర్స్ కాలనీ, పీహెచ్‌వాడ, దుర్గానగర్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి రికార్డులు, హాజరు పట్టీలను క్షుణ్ణంగా పరిశీలించారు. రిజిష్టరులో దిద్దుబాట్లు ఉండడంపై అంగన్‌వాడీ టీచర్లను ఆరా తీశారు.

అంగన్‌వాడీ పిల్లలకు వడ్డించే ఆహారాన్ని పరిశీలించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకం నాణ్యతను రుచి చూశారు. ఆహారానికి సంబంధించిన సరకులను పరిశీలించారు. రేషన్ డిపో డీలర్లకు, అంగన్‌వాడీ టీచర్లకు, జగనన్న గోరుముద్ద నిర్వాహకులకు తగు సూచనలు, సలహాలు అందించారు. ఈయనతో పాటు లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ బి.రామచంద్రయ్య, ఇన్‌స్పెక్టర్ డి.భాస్కరరావు, ఏఎస్‌వో నందకిషోర్, ఐసీడీఎస్ పీడీ కె.అనంతలక్ష్మి, సీడీపీవో కె.శ్రీవిద్య, ఏఈవో కేఎస్ గాంధీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సౌజన్య తదితరులు వున్నారు.

క్లుప్తంగా

అకౌంట్ నుంచి రూ.20 వేలు మాయం!

మునగపాక : ఒకవైపు పదే పదే సైబర్ మోసాలకు గురికావద్దంటూ అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నా గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడో దగ్గర మోసాలకు గురవుతూనే ఉన్నారు. మహిళా పోలీసులు ప్రజలను సైబర్ క్రైంకు సంబంధించి ప్రచారం చేస్తున్నా కొంత మంది కేటుగాళ్ల మాయలో పడి నష్టపోతున్నారు. ఇలాంటి సంఘటన మండలంలోని పల్లపు ఆనందపురంలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గొంతిన అఖిల బీటెక్ చదువుతుంది. కొద్ది రోజులుగా అఖిలకు ఇతర రాష్ట్రానికి చెందిన వ్యక్తి ఇంగ్లిష్‌లో మాట్లాడుతూ డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగం ఇప్పిస్తామంటూ పలుమార్లు ఫోన్ చేస్తూ ఇబ్బందులకు గురి చేశాడు. తక్షణమే రూ.20వేలు పంపాలని, లేకుంటే మీ ఇంటిని జప్తు చేస్తామని బెదిరించడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో వారు పంపిన లింక్‌ను క్లిక్ చేసింది. దీంతో అఖిలకు సంబంధించిన బ్యాంక్ అకౌంట్ నుంచి రూ.20వేలు బదిలీ అయినట్టు గుర్తించి మునగపాక పోలీసులను ఆశ్రయించింది. పోలీసుల సూచనలతో ఎస్‌బీఐకి వెళ్లి సంబంధిత అధికారులకు జరిగిన మోసంపై వివరించింది. దీంతో అఖిలకు చెందిన ఖాతా నంబరును హోల్డ్‌లో ఉంచారు. కాగా తనకు న్యాయం జరిగేలా చూడాలని ఆమె పోలీసులను కోరుతున్నారు.

ఫార్మా ప్రమాద మృతులకు పోస్టుమార్టం



తక్షణ సాయం, రాతపూర్వక పరిహార హామీ పత్రాలు అందిస్తున్న సాహితి ప్రతినిధులు

రాంబిల్లి : సాహితి ఫార్మా పరిశ్రమ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మృతి చెందిన కార్మికులు ఎస్.అప్పారావు, బి.రామేశ్వర్ మృతదేహాలకు మంగళవారం పోస్టుమార్టం నిర్వహించారు. వీరికి సాహితి పరిశ్రమ యాజమాన్యం తక్షణ సాయం కింద ఒక్కో కుటుంబానికి రూ.లక్ష చొప్పున అందించింది. ఈ నెల 12లోగా రూ.8 లక్షలు, ఆగస్టు 10లోపు మరో రూ.25 లక్షలు అందేలా రాతపూర్వకంగా హామీ పత్రాలను మృతుల కుటుంబసభ్యులకు అందజేసినట్టు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము తెలిపారు.

27న జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశాలు

మహారాణిపేట: జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశాలు ఈనెల 27న నిర్వహించనున్నట్లు సీఈవో శ్రీరామ్మూర్తి తెలిపారు. జిల్లా పరిషత్ ఆవరణలో జెడ్పీ చైరపర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన ఒకటి నుంచి ఏడు స్థాయీ సంఘాల సమావేశాలు జరుగుతాయని, ఈ మేరకు సభ్యులకు ఆహ్వానం పంపినట్లు పేర్కొన్నారు.

గత ప్రభుత్వ తప్పిదం వల్లే.. ఇళ్ల పంపిణీ ఆలస్యం



టిడ్కో గృహాల హక్కుపత్రాలు తీసుకోవడానికి వచ్చిన మహిళలు



లబ్ధిదారులకు హక్కుపత్రాలు, ఇంటి తాళాలు అందజేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

- ఎమ్మెల్యే యూవీ రమణమూర్తిరాజు
- టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు హక్కుపత్రాల పంపిణీ

యలమంచిలి : చంద్రబాబునాయుడు టిడ్కో ఇళ్ల కాంట్రాక్టర్లకు రూ. 2 వేల కోట్లు బకాయిలు పెట్టిసి సకాలంలో చెల్లించకపోవడం వల్లే ఇళ్ల పంపిణీ ఆలస్యం అయిందని యలమంచిలి ఎమ్మెల్యే యూవీ రమణమూర్తిరాజు అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు ఇళ్ల హక్కు పత్రాలు, ఇంటి తాళాలను మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార్‌వర్మతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం మధ్యలో వదిలేసిన గృహాలను అలాగే ఇవ్వలేక అన్ని సదుపాయాలు పూర్తి చేసి అందించేందుకు ఈ సమయం పట్టిందన్నారు. ఇంకా ఏవైనా సమస్యలుంటే టిడ్కో అధికారులు అక్కడే అందుబాటులో ఉండి సేవలందిస్తారని తెలిపారు. లబ్ధిదారులు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనివార్య కారణాల వల్ల ఇంకా 15 ప్లాట్లకు రిజిస్ట్రేషన్ పూర్తి కాలేదన్నారు. దరఖాస్తు చేసుకునే అర్హులకు వాటిని అందజేస్తామన్నారు. లబ్ధిదారులకు త్వరితగతిన టిడ్కో ఇళ్లు ఇవ్వాలని సీఎం జగన్ మోహన్‌రెడ్డికి సూచించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. సమావేశంలో ముందుగా మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి మాట్లాడుతూ యర్రవరం వద్ద నూతనంగా నిర్మించిన టిడ్కో గృహాలు ప్రారంభించడం ఆనందించదగ్గ విషయమన్నారు. లబ్ధిదారులందరూ మున్సిపల్ కార్యాలయంలో హక్కు పత్రాలు తీసుకోవాలన్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార్‌వర్మ మాట్లాడుతూ ప్రతిపక్షాలు ఎన్ని దుష్ప్రచారాలు చేసినా రాష్ట్ర ప్రభుత్వం దృఢ సంకల్పంతో టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందజేసిందన్నారు. ప్రతిపక్షాల తప్పుడు ఆరోపణలను ప్రజలు నమ్మరన్నారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బెజవాడ నాగేశ్వరావు, పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బొద్దపు యర్రయ్యదొర, కౌన్సిలర్లు ఒగిబోయిన చిరంజీవి, దాసరి కుమార్, మున్సిపల్ కమిషనర్ వీరయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వల్లా శ్రీనివాసరావు, మెప్మా అధికారిణి పద్మావతి, టిడ్కో గృహాల ఏఈ అనూష, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు

మాదకద్రవ్యాల రవాణాపై గట్టి చర్యలు



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి, ఎస్పీ మురళీకృష్ణ

తుమ్మపాల : జిల్లాలో మాదకద్రవ్యాలను అరికట్టడానికి, గంజాయి ఇతర మత్తు పదార్థాల వినియోగం, విక్రయాలు, రవాణా అరికట్టేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్టు కలెక్టర్ రవిపట్టాన్ శెట్టి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డికి తెలిపారు. మాదక ద్రవ్యాల నివారణ, తీసుకోవాల్సిన చర్యలపై తాడేపల్లి నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా నుంచి కలెక్టర్, ఎస్పీ కె.వి.మురళీకృష్ణ, పోలీసు అధికారులు పాల్గొన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలను యువతకు తెలియజేసి, మత్తు పదార్థాల బారిన పడకుండా పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్న సీఎస్ సూచనల మేరకు కార్యక్రమాలు చేపడతామని కలెక్టర్ అన్నారు. విద్యార్థులు, ఆటో డ్రైవర్లు, వర్కర్లను లక్ష్యంగా చేసుకుని మాదక ద్రవ్యాలు సరఫరా జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, గట్టి నిఘా ఉంచి విక్రయాలు జరిగే ప్రాంతాలను గుర్తించాలన్నారు. వ్యసనాల బారిన పడిన వారి పట్ల సున్నితంగా వ్యవహరించాలని పోలీసులకు సూచించారు. బాధితులకు కౌన్సెలింగ్‌తో పాటు పునరావాసం కల్పించాలన్నారు. సరఫరాపై సమాచారం అందించేందుకు టోల్ ఫ్రీ నంబర్ 1540 పోస్టర్లను విద్యాసంస్థలతో పాటు బహిరంగ ప్రదేశాల్లో ప్రచురించాలని సూచించారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో మహిళా పోలీసుల ద్వారా నిఘా పెట్టాలన్నారు. గంజాయి సాగు చేపట్టకుండా అటవీశాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. యువత ప్రవర్తనపై తల్లిదండ్రుల పర్యవేక్షణ ప్రత్యక్షంగా ఉండాలన్నారు.

అర్హులందరికీ జగనన్న సురక్షతో లబ్ధి చేకూరేలా చర్యలు

జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా అర్హులైన వారందరికి లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకున్నామని, ఇంటింటి సర్వే ద్వారా అర్హుల వివరాల నమోదు ద్వారా పథకాలు అందిస్తున్నట్టు కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మంగళవారం 15 గ్రామ సచివాలయాల్లో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో 6246 ధ్రువపత్రాలను ప్రజలకు ఉచితంగా అందించినట్టు తెలిపారు. జిల్లాలో 7 మండలాలు, 1 మున్సిపాలిటీ (జీవిఎంసీ)లో ఈ కార్యక్రమం జరిగిందన్నారు. నెల రోజుల పాటు 11 రకాల ధ్రువ పత్రాలను ఉచితంగా ప్రజలకు అందిస్తామన్నారు.

విశాఖ వెళ్లి పింఛన్ అందజేత



విశాఖ ఆసుపత్రిలో బిడ్డ దేవికి పింఛన్ అందజేస్తున్న త్రివేణి



కేర్ ఆస్పత్రిలో వరహాలబాబుకు పింఛన్ అందజేస్తున్న దివ్యవాణి



అప్పారావుకు పింఛన్ అందిస్తున్న రమణబాబు

దేవరాపల్లి : మండలంలోని ఎస్. గజపతినగరం గ్రామ వలంటీర్ ఈర్లె త్రివేణి విశాఖపట్నం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఒంటరి మహిళకు పింఛన్ సొమ్ము అందజేసి మానవత్వం చాటింది. గ్రామానికి చెందిన ఒంటరి మహిళ బిడ్డ దేవి గైనిక్ సమస్యతో విశాఖపట్నంలోని గాయిత్రి ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. విషయం తెలుసుకున్న వలంటీర్ త్రివేణి రెండు వైపులా సుమారు 100 కి.మీ. మేర ప్రయాణించి విశాఖపట్నంలోని సదరు ఆసుపత్రికి చేరుకుని పింఛన్ సొమ్ము అందజేసింది. వలంటీర్ త్రివేణి సేవాస్ఫూర్తికి గ్రామస్తులు అభినందించారు.

విశాఖ వెళ్లి పింఛన్ అందించిన వలంటీర్

బుచ్చెయ్యపేట : విశాఖపట్నం ఆసుపత్రిలో ఉన్న బుచ్చెయ్యపేట మండలం ఎల్. శింగవరానికి చెందిన వితంతువు రేణం అచ్చియమ్మకు వలంటీర్ నగేష్ పింఛన్ అందించాడు. అచ్చియమ్మ కుమారుడు ఇటీవల చెట్టు మీద నుంచి కింద పడటంతో వెన్నుముక దెబ్బతిని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. వారు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకున్న వలంటీర్ నరేష్ సొంత ఖర్చులతో విశాఖ ఆసుపత్రికి వెళ్లి అచ్చియమ్మకు, ఇదే ఆసుపత్రిలో ఉన్న మరో దివ్యాంగుడు రాముకు పింఛన్ నగదు అందించాడు.

విశాఖ కేర్ ఆస్పత్రికి వెళ్లి పింఛను పంపిణీ

మాడుగుల రూరల్ : వీరనారాయణం గ్రామాన్నికి చెందిన కోర్రా వరహాలబాబు డయాలసిస్ పేషెంటు కావడంతో విశాఖ కేర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వైఎస్సార్ పింఛను కింద డయాలసిస్ పేషెంటుకు ఇచ్చే రూ. 10 వేల పింఛన్ నగదును మంగళవారం వలంటీరు పందిరి దివ్యవాణి కేర్ ఆస్పత్రికి వెళ్లి ఆయనకు అందజేసింది. ఆమెను గ్రామ సర్పంచ్, కార్యదర్శి అభినందించారు.

విశాఖ కిమ్స్ ఐకాన్‌కు వెళ్లి పింఛన్ అందజేత

రావికమతం : గుడ్డిప గ్రామ వలంటీర్ రమణబాబు మంగళవారం రాత్రి పింఛన్‌దారు అప్పారావు అనారోగ్యంతో విశాఖ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్టు తెలుసుకుని అక్కడికి వెళ్లి ఆయనకు పింఛన్ అందించాడు. అలాగే ఆతని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకోవడంతో ఆయన ఆకుటుంబీకులు వలంటీర్‌ను అభినందించారు.

అల్లూరి ఆశయసాధనకు కృషి చేయాలి



అల్లూరికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే గణేష్ తదితరులు

గొలుగొండ : మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు ఆశయసాధనకు అందరూ కృషి చేయాలని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. అల్లూరి జయంతిని పురస్కరించుకుని కృష్ణదేవిపేట (ఏఎల్‌పురం)లో ఉన్న అల్లూరి సమాధులకు పూలమాలతో నివాళులు అర్పించారు. అలాగే సీతారామరాజు తల్లి నారాయణమ్మ, పార్కులో ఉన్న అల్లూరి కాంస్య విగ్రహం వద్ద నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ మాట్లాడుతూ అమాయక గిరిజనులను బ్రిటీష్ పాలకులు నానా ఇబ్బందులు పెడుతున్న సమయంలో అల్లూరి బ్రిటీష్ పాలకులపై పోటాటం చేసి అతి చిన్న వయస్సులోనే ప్రాణాలు అర్పించిన గొప్ప దేశ భక్తుడు అన్నారు. నర్సీపట్నం మార్కెట్ యార్డ్ చైర్మన్ చిటికెల భాస్కరనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు సుర్ల వెంకట గిరిబాబు, పార్టీ మండల అధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ, వైస్ ఎంపీపీ సుర్ల ఆదినారాయణ, ఎంపీటీసీ సభ్యులు లోచల సుజాత, బుల్లి ప్రసాద్, చోద్యం సహకార బ్యాంక్ చైర్మన్ పెద్దిరాజు, ఏఎంసీ చైర్మన్ సత్యనారాయణ, యూత్ అధ్యక్షుడు రామకృష్ణనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మహిళను చంపిన కేసులో నిందితుడికి యావజ్జీవం



నిందితుడు రావాడ ఏసు

విశాఖ లీగల్/పాయకరావుపేట : క్షణికావేశంలో మహిళను అతి కిరాతకంగా హత్య చేసిన వ్యక్తికి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ నగరంలోని 12వ అదనపు న్యాయమూర్తి మంగళవారం తీర్పు చెప్పారు. జైలు శిక్షతో పాటు రూ.5000 జరిమానా చెల్లించాలని, లేని పక్షంలో అదనంగా మూడు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని న్యాయమూర్తి పేర్కొన్నారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వి.దేవానందరావు, పాయకరావుపేట పోలీసులు వేర్వేరుగా తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పాయకరావుపేట ఇందిరా కాలనీకి చెందిన బొల్లం రాజ్యలక్ష్మి భర్తను విడిచిపెట్టి ఇద్దరు పిల్లలతో కలిసి తల్లి వద్ద ఉంటోంది. ఇదే క్రమంలో ఇంటి పక్కనే ఉన్న రావాడ ఏసుతో వివాహేతర సంబంధం పెట్టుకొని లింగాల తోటకాలనీలో సహజీవనం చేస్తోంది. రావాడ ఏసు వృత్తిరిత్యా తాపీమేస్త్రి. 2015 అక్టోబర్‌లో నిందితుని భార్య పురిటికి తన పుట్టింటికి వెళ్లింది. ఆ సమయంలో రాజ్యలక్ష్మి ఏసు ఇంట్లో ఉంది. ఈ క్రమంలో వారిద్దరి నడుమ గొడవ జరగడంతో కోపోద్రిక్తుడైన ఏసు 2015 అక్టోబరు 1వ తేదీన అర్ధరాత్రి సమయంలో రాజ్యలక్ష్మిని ఇంటి పక్కనే ఉన్న పనస చెట్టుకు ఆనించి గొంతు నులిమి హత్య చేశాడు. రాజ్యలక్ష్మి చనిపోయిందని ఆమె తల్లికి సమాచారం ఇవ్వడంతో ఆమె వచ్చి తన కుమార్తె మరణంపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు పాయకరావుపేట పోలీసులు హత్య కేసుగా నమోదు చేశారు. విచారణలో ఇది హత్య అని రుజువై, ఈ దారుణానికి ఒడిగట్టింది రావాడ ఏసుగా నిర్ధారణ కావడంతో విశాఖపట్నం 12వ ఏడీజే కోర్టు వారు మంగళవారం నిందితుడికి శిక్ష విధిస్తూ పై విధంగా తీర్పు చెప్పారు. ఈ కేసు దర్యాప్తు చేసిన ఇన్‌స్పెక్టర్లు కె. వెంకటరావు, జి.రాంబాబు, వాదనలను వినిపించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ వి.దేవానందరావులను జిల్లా ఎస్పీ కె.వి. మురళీకృష్ణ అభినందించారు.

మహిళల స్వయం ఉపాధి కల్పనకు రుణాలు



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ మురళి

ముంచంగిపుట్టు: మహిళల స్వయం ఉపాధి కల్పనే లక్ష్యంగా రుణాలు మంజూరు చేస్తున్నట్టు డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టరు మురళి అన్నారు. ఏపీఎం దేవమంగ ఆధ్వర్యంలో స్థానిక వెలుగు కార్యాలయ సమావేశ మందిరంలో స్త్రీ నిధి రుణం తీసుకున్న డ్వాక్రా మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఏ పీడీ మాట్లాడుతూ స్త్రీ నిధి రుణాలు తీసుకున్న ప్రతి ఒక్కరూ వాటిని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. రుణాల వాయిదాలు సక్రమంగా కట్టాలని, అప్పుడే సంఘం బలోపేతమవుతుందన్నారు. అన్ని సంఘాలు రుణాలు తీసుకొని సొంత వ్యాపారాన్ని వృద్ధి చేసుకోవాలని కోరారు. అనంతరం వెలుగు ద్వారా మహిళలకు మంజూరవుతున్న రుణాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బ్యాంక్ లింకేజ్ డీపీఎం వైకుంఠరావు, స్త్రీనిధి ఏజీఎం, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

పశువుల్లో సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



పశు వైద్య కేంద్రాన్ని సందర్శిస్తున్న కరుణాకర్‌రావు

కశింకోట : వర్షాకాలంలో పశువుల్లో వచ్చే వ్యాధులపై రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కలిగించేందుకు చర్యలు తీసుకోవాలని పశు సంవర్థక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎస్. కరుణాకర్‌రావు ఆదేశించారు. మండలంలోని నరసింగబిల్లి పశు వైద్య కేంద్రాన్ని మంగళవారం పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. పాడి రైతులు పశువులు, కోళ్ల వంటి వాటి పెంపకంపై అవగాహన కల్పించేందుకు పశు మత్స్యదర్శిని పుస్తకం ఉపయోగపడనుందన్నారు. దీన్ని రైతులకు అందించేందుకు వారి పేర్లు నమోదు చేయాలన్నారు. పశువులకు తప్పనిసరిగా బీమా చేయాలన్నారు. పశు పోషణ చేసే రైతులకు రాయితీపై గడ్డి విత్తనాలు అందించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. 200 కిలోల మొక్కజొన్న, 50 కిలోల జొన్న విత్తనాలు రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అందించడానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. మొక్కజొన్న ఐదు కిలోల విత్తనాల ధర రూ.460 కాగా, దీనిలో 75 శాతం రాయితీ పోను రూ.113కు సరఫరా చేస్తామన్నారు. అలాగే జొన్నలు 5 కిలోల ధర రూ.340 కాగా, రాయితీ పోను రూ.85కు అందించనున్నామన్నారు. సంపూర్ణ మిశ్రమ దాణా కిలో రూ.15.80 కాగా, దీనిలో 60 శాతం రాయితీ పోను కిలో రూ.6.50కు లభించనుందన్నారు. రైతులు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పశు వైద్యాధికారి చైతన్యమణి, ఏహెచ్ఏ అశ్విని, రూపవతి, రాజేష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

యల్లయ్య కాలువలో పడి వ్యక్తి మృతి



కాలువ నుంచి మృతదేహాన్ని తీస్తున్న స్థానికులు

అనకాపల్లిటౌన్ : గవరపాలెం రామునాయుడుకాలనీకి చెందిన మామిడాల నారాయణ (26) బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తూ యల్లయ్యకాలువలో మంగళవారం పడి మృతి చెందాడు. సీఐ దాడి మోహన్‌రావు అందించిన వివరాలిలా ఉన్నాయి. నారాయణ ఎన్టీఆర్ వైద్యాలయం ఎదురుగా కొబ్బరిబొండాలు అమ్ముకుంటూ జీవిస్తున్నాడు. ఉదయం బహిర్భూమికని వెళ్లిన నారాయణరావు మధ్యాహ్నం వరకు తిరిగి రాకపోవడంతో అక్కడే ఉన్న కొంతమంది ఎన్టీఆర్ ఆస్పత్రి వెనుక ఉన్న యల్లయ్యకాలువలో చూడగా అతను శవమై కన్పించాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని వైద్యాలయానికి తరలించారు. మృతుడి తండ్రి సత్తిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ చెప్పారు.

వీఆర్పీ అనంతలక్ష్మికి షోకాజ్ నోటీస్

రోలుగుంట : మండలంలోని బుచ్చింపేట వీఆర్పీ అయిన అనంతలక్ష్మికి ఉపాధి పనుల్లో అవకతవకలకు పాల్పడిందన్న ఆరోపణలపై డ్వామా పీడీ షోకాజ్ నోటీస్‌ను మంగళవారం జారీ చేశారని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో కోసూరి సూర్యామణి తెలిపారు. గ్రామంలో 15 ఏళ్లుగా వీఆర్పీగా పనిచేస్తూ దొంగ మస్తర్లు వేస్తున్న వైనంపై గ్రామానికి చెందిన మూడు చెరువుల్లో అభివృద్ధి పనులు చేస్తున్న ఉపాధి కూలీలు అధికారులకు ఫిర్యాదు చేసిన విషయం విదితమే. దీనిపై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డ్వామా జిల్లా విభాగం ఏపీడీ రోజారాణి, యలమంచిలి ఏపీడీ బి.శ్రీనివాసరావు గత నెల 27న గ్రామ సచివాలయంలో విచారణ జరిపి నివేదికను అందజేశారు. దీనిని పరిశీలించిన డ్వామా పీడీ సందీప్ వారం రోజుల్లో వివరణ ఇవ్వాలని అనంతలక్ష్మికి షోకాజ్ నోటీసును జారీ చేశారు.

చెరకు పంటకు మరో పది రోజులే గడువు

- వశిష్ట,విశాఖ రకాలే మేలు
- తాజాగా కురుస్తున్న వర్షాలతో నాట్లకు సిద్ధమవుతున్న రైతులు



03ఎకెపి06: చెరకు పంట

అచ్యుతాపురం (అనకాపల్లి) : మందగించిన రుతు పవనాలతో వర్షాలు మైదాన ప్రాంతాల్లో అంతంతగానే కురుస్తున్నాయి. ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలోని ఏజెన్సీలో భారీగా వర్షాలు కురుస్తున్నప్పటికీ మైదానంలో మందకొడిగానే ఉన్నాయి. ఏడాది పొడవునా సాగు చేసే చెరకు విషయంలో వర్షాధార చెరకుకు వర్షాకాలమే కీలకం. ఈ ఏడాది జూన్ నాల్గవ వారమొచ్చినా ఇంకా ఆశించిన చినుకు జాడ లేదు. ఏజెన్సీ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో సాగునీటి కాలువల్లోకి నీరు చేరింది. చెరకు నాట్లకు కచ్చితంగా పొలమంతా తడవాల్సిందే. దీనికి గానూ గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలను రైతులు సద్వినియోగం చేసుకునేందుకు సన్నద్ధం అవుతున్నారు. చెరకు పంటంటే గుర్తొచ్చే ప్రధాన జిల్లాల్లో అనకాపల్లి ఒకటి.

8 వేల హెక్టార్లలో సాగు...

ఉమ్మడి విశాఖ జిల్లాలో అన్ని సీజన్లలో కలిపి 40 వేల హెక్టార్లలో చెరకు సాగు అయ్యేది. క్రమేణా చెరకు సాగు విస్తీర్ణం తగ్గిపోతూ వస్తోంది. చక్కెర కర్మాగారాలు క్రమక్రమంగా మూత పడుతుండటంతో ఆ ప్రభావం చెరకు సాగుపైనా పడుతోంది. అనకాపల్లి జిల్లాలో జాతీయ స్థాయిలో బెల్లం మార్కెట్ ఉండటంతో చెరకు సాగు ఆ మాత్రమైనా కొనసాగుతోంది. విత్తనంతో పాటు చక్కెర కర్మాగారాలకు, బెల్లం తయారీకి ఉపయోగించే చెరకు సాగులో భాగంగా వర్షాధార చెరకు సాగు దాదాపు జూన్ నెలాఖరు నాటికి పూర్తి కావాలి. చాలా చోట్ల భూమిలో చెమ్మదనం కనిపించడం లేదు. పడిన కొద్ది పాటి జల్లులు ఆవిరైపోతున్నాయి. రుతుపవనాల కదలిక ఇటీవల పెరగడంతో భారీ వర్షాలను దృష్టిలో పెట్టుకుని జూలై రెండో వారంలోపు వర్షాధార చెరకు సాగు చేసుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

వశిష్ట, విశాఖ రకాలే కీలకం..


వర్షాధార చెరకు సాగులో భాగంగా పక్వదశను దృష్టిలో పెట్టుకుని వశిష్ట, విశాఖ రకాలనే సాగు చేయాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. ఏప్రిల్ నెలాఖరులోగా వర్షాధార చెరకు కోత దశకు వస్తుంది. తద్వారా అన్‌సీజన్‌కు ముందు వండే బెల్లం మార్కెట్‌లోనూ మంచి ధర పలుకుతుంది. ఉమ్మడి విశాఖ జిల్లాలో 8–9 వేల హెక్టార్లలో వర్షాధార చెరకు సాగు అవుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది.

ఎకరానికి 20 వేల ముచ్చెలు నాటాలి..

ఎకరానికి 20 వేల ముచ్చెలు నాటాలి. మూడు కళ్ల ముచ్చెల్ని కాస్త అడ్డంగా నాటాలి. 75.50.50 నిష్పత్తితో నత్రజని, భాస్వరం, పొటాష్ అందేలా ఎరువులు అందించాలి. స్వల్పకాలిక రకాలను వర్షాధారంగా సాగు చేయాలి. వర్షాలను ఉపయోగించుకుని వశిష్ట, విశాఖ రకాలను సాగు చేస్తే త్వరితగతిన పక్వానికి వచ్చి కోతకు దోహదపడుతుంది.

–ముకుందరావు, వ్యవసాయ శాస్త్రవేత్త

తైక్వాండో పోటీల్లో సత్తా చాటిన క్రీడాకారులు



పతకాలు సాధించిన, చోడవరం, అనకాపల్లి క్రీడాకారులు

చోడవరం: రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో చోడవరం, అనకాపల్లి క్రీడాకారులు పతకాల సాధించారు. ఈనెల 1 నుంచి 3వ తేదీ వరకు తిరుపతిలో ఈ పోటీలు జరిగాయని రాష్ట్ర తైక్వాండో అసోషియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు పల్లం మురళి మంగళవారం తెలిపారు. ఈ పోటీల్లో విద్యార్థులు వివిధ విభాగాల్లో బంగారు, రజత, కాంస్య పతకాలు సాధించారని చెప్పారు. పూమ్‌సే క్రీడలో చోడవరం, అనకాపల్లి ప్రాంతాలకు చెందిన కె. రోహిత్, డి. కృష్ణవేణి, డి. జాహ్నవి, షేక్ వహీదార బంగారు పతకాలు సాధించారు. 46,48 కేజీల విభాగంలో డి. జాహ్నవి, ఎల్. గిరీష్, కె. రోహిత్ రజత పతకాలు, 58 కేజీల విభాగంలో షేక్ వహిదా భాషిర, ఎం. వినయ్ వర్దన్ కాంస్య పతకాలు సాధించినట్టు మురళి తెలిపారు. బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులు ఈనెల 7,8,9 తేదీల్లో కర్ణాటకలో జరగబోయే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. క్రీడాకారులను అభినందించారు.

క్లుప్తంగా

పడమటమ్మ సన్నిధిలో హోమం



విసన్నపేట వద్ద పడమటమ్మలోవలో నిర్వహిస్తున్న హోమం

కశింకోట: మండలంలోని విసన్నపేట వద్ద లోవలో వెలసిన పడమటమ్మ ఆలయంలో మంగళవారం హోమం నిర్వహించారు. భక్తులు తీసుకొచ్చిన నెయ్యి, హోమ సామగ్రి, పూజా ద్రవ్యాలు వేసి శాస్త్రోక్తంగా వేద మంత్రాల నడుమ హోమం జరిపించారు. గురువు పెనుమటి సాంబమూర్తి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వివిధ ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

అనకాపల్లిటౌన్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ట్రాఫిక్ ఎస్ఐ జె.రమేష్ చెప్పారు. ఎస్ఐ అందించిన వివరాలిలా ఉన్నాయి. గాజువాక మండలం శ్రీహరిపురానికి చెందిన దాడి సూరిబాబు ఈ నెల 2న పట్టణంలోని లక్ష్మీదేవిపేటలో జరిగిన పండగకు బంధువుల ఇంటికి వచ్చాడు. అదే రోజు రాత్రి తన స్వగృహానికి తిరిగి వెళ్తుండగా కొప్పాక బ్రిడ్జి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడ్ని కేజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడని, మృతుడి కుమారుడు జీవన్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు అసకపల్లి, పైడివాడ అగ్రహారంలో 'జగనన్న సురక్ష'

సబ్బవరం: మండలంలోని అసకపల్లి,పైడివాడ అగ్రహారం సచివాలయాల్లో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రమేష్ నాయుడు తెలిపారు. అసకపల్లి సచివాలయంలో తహసీల్దార్ సత్యనారాయణ ఆధ్వర్యంలో పైడివాడ అగ్రహారంలో ఎంపీడీవో రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ నిర్వహించే కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అనకాపల్లి సినిమాలు

లవ్ యూ రామ్	రాజా
టక్కర్	సత్యనారాయణ స్క్రీన్-1
ఇండియానా జోన్స్	సత్యనారాయణ స్క్రీన్-2
ఈ నగరానికి ఏమైంది? (మార్నింగ్,మ్యాటీ)	
మాయా పేటిక (ఫస్ట్,సెకెండ్ షో)	షిర్డిసాయి
అశ్విన్స్	పర్తిసాయి
భీమదేవరపల్లి బ్రాంచి(3 ఆటలు)	
నారాయణ అండ్ కో	వెంకటేశ్వర
స్పై	శ్రీసత్య
సామజవరగమన	రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు మంగళవారం 161 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	-	-
రెండో రకం	4,000	4,250
మూడోరకం	3,600	3,850

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 77 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-9 యూనిట్లు, ఏ నెగిటివ్-2 యూనిట్లు, బీ పాజిటివ్-29 యూనిట్లు, బీ నెగిటివ్-2 యూనిట్లు, ఓ పాజిటివ్-27 యూనిట్లు, ఓ నెగిటివ్-4 యూనిట్లు, ఏబీ పాజిటివ్-4 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 364 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 391 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

పశువుల చెంతకే వైద్యం

దివంగత మహానేత వైఎస్సార్ ఆపదలో ఉన్న వారికి సత్వర వైద్యం అందించేందుకు 108 సేవల్ని ప్రవేశపెట్టారు. ఆయన తనయుడు సీఎం జగన్ మరో అడుగు ముందుకేసి మూగ జీవాలకు మెరుగైన వైద్యం అందించేందుకు డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ పేరిట అంబులెన్స్‌లను ఏర్పాటు చేశారు. టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేస్తే చాలు నిముషాల వ్యవధిలో పశువు ఉన్న చోటనే వైద్య సేవలు అందుతున్నాయి.



ఆవుకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు



ఆవుకు సిజేరియన్ చేస్తున్న వైద్యులు

- 1962కు ఫోన్ చేస్తే చాలు పశువుల వద్దకు అంబులెన్స్ సేవలు
- వాహనంలోనే ల్యాబ్, పశువుల్ని తరలించేందుకు హైడ్రాలిక్ క్రేన్
- అనకాపల్లి నియోజకవర్గానికి రెండు అంబులెన్సులు

అనకాపల్లి రూరల్ : ప్రజారోగ్య పరిరక్షణకు 108, 104 ద్వారా సేవలందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం మూగ జీవాలకు కూడా సకాలంలో అత్యవసర వైద్యం అందిస్తోంది. సంచార పశు ఆరోగ్య సేవా రథాలతో పాడి రైతుల ఇళ్ల వద్దకే వెళ్లి వైద్య సేవలతో పాటు అత్యవసరమైన శస్త్ర చికిత్సలు కూడా చేస్తున్నారు. అనకాపల్లి నియోజకవర్గానికి రెండు సంచార పశు ఆరోగ్య సేవా రథాలు కేటాయించారు. 1962 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేస్తే చాలు.. పశువుల ముంగిటకే అంబులెన్స్ వచ్చి వైద్యం అందిస్తోంది. దీంతో మూగజీవులు అస్వస్థతకు గురైతే వైద్యం కోసం ఇన్నేళ్లూ పడ్డ తిప్పలు తప్పాయని పాడిరైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

24 గంటలూ అందుబాటులో..

గతంలో మూగజీవాలు అస్వస్థతకు గురైతే రైతులు పడే కష్టాలు అన్నీ ఇన్నీ కావు. చాలా వరకు తమకు తెలిసిన నాటు వైద్యంతో సరిపుచ్చేవారు. మండల కేంద్రాలైతే పశు వైద్యశాలకు వెళ్లి వైద్యం చేయించేవారు. పశువులు నడిచే పరిస్థితిలో లేనప్పుడు యజమానుల తిప్పలు అన్నీఇన్నీ కావు. అంబులెన్స్ సేవలు రావడంతో మూగజీవాలకు 24 గంటలూ వైద్య సేవలు అందుతున్నాయి. అంతేకాకుండా పశువులకు అవసరమైన టీకాలు కూడా గ్రామాల్లోనే వేస్తున్నారు. అంబులెన్స్‌లోనే ల్యాబ్, పశుల్ని చేర్చేందుకు క్రేన్ ఏర్పాట్లున్నాయి. అంబులేటరీ క్లినిక్‌లకు నిర్దేశించిన 1962 టోల్ ఫ్రీ నంబరు 24 గంటలూ పనిచేస్తుంది. ఈ సేవలను 4 రకాలుగా విభజించారు. లెవెల్-1 ఫెర్టిలైజర్‌తో కూడిన మేత తిని అస్వస్థతకు గురైనప్పుడు, పాముకాటు, పాల జ్వరం, కడుపు ఉబ్బరం తదితర కేసులకు గంట నుంచి రెండు గంటల్లోపు చికిత్స అందుతుంది. లెవెల్-2 నుంచి లెవెల్-4 వరకు వచ్చే అత్యవసరం కాని కేసులకు 5 నుంచి 24 గంటల్లోపు వైద్య సేవలు అందిస్తున్నారు.

అంబులెన్స్‌లో 120 రకాల మందులు

యాంటీ బయోటిక్స్, పెయిన్ కిల్లర్స్, విటమిన్ ఇంజక్షన్లు, కాల్షియం టానిక్‌లు, యులాన్ లిక్విడ్, టానిక్‌లు, పౌడర్‌లు, మినరల్ మిక్చర్, సెలైన్ బాటిల్స్ తదితరాలన్నీ అంబులెన్స్‌లో అందుబాటులో ఉంటాయి. ఇలా 120కి పైగా మందులు సిద్ధంగా ఉంచుతున్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు నియోజకవర్గంలోని అనకాపల్లి పట్టణ, మండల పరిధిలో 861 పశువులు, కశింకోటలో 218 పశువులకు రెండు అంబులెన్స్‌ల ద్వారా వైద్య సేవలందించారు.

కష్టాలు తొలగాయి



నా ఆవుకు కాన్పు సమయంలో ఇబ్బంది వచ్చింది. 1962 టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి పరిస్థితి వివరించా. వెంటనే నా ఆవు వద్దకే వచ్చి సిజేరియన్ చేశారు. పశువులకు సంచార వైద్య సేవలు అందించాలన్న సీఎం జగన్ ఆలోచన అద్భుతం. ఇది నిజంగా పాడి రైతులందరికీ ఎంతగానో ఉపయోగపడుతోంది. పశు వైద్య శాలలకు వెళ్లే ఇబ్బంది తప్పింది.

– ఆళ్ల జగ్గ అప్పారావు, రైతు,తుమ్మపాల

అత్యుత్తమ వైద్య సేవలు



మూగజీవాలకు వైద్య పరీక్షలు అందించేందుకు రాష్ట్రంలో తొలిసారిగా సీఎం జగన్ అంబులెన్స్ సేవలు ప్రవేశపెట్టారు. వెటర్నరీ పాలి క్లినిక్ ద్వారా అత్యవసరమైన కేసులకు శస్త్రచికిత్సలు, సాధారణ కేసులకు చికిత్స అందించి కాపాడుతున్నాం. పేడ, మూత్రం, రక్త పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్యం అందిస్తున్నాం. పాడిరైతులు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ బి.సౌజన్య, ఏడీ, పశుసంవర్ధక శాఖ, అనకాపల్లి

గ్రామ సమస్యలకు దశలవారీగా పరిష్కారం



స్థానికులకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్



దర్జీనగర్‌లో పూర్తయిన డ్రైనేజీ పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి అమర్‌నాథ్

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో మంత్రి అమర్‌నాథ్
- రూ.59 లక్షలతో పూర్తిచేసిన అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం

అనకాపల్లిటౌన్ : గ్రామాల్లో ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారానికి దశలవారీగా కృషి చేస్తున్నట్లు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. మండలంలోని బవులవాడ పంచాయతీ దర్జీనగర్ గ్రామంలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి అమర్‌నాథ్ ఇంటింటికీ వెళ్లి కుటుంబాల వారీగా అందిన సంక్షేమ లబ్ధిని గణాంకాలతో సహా వివరించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా పాడైపోయిందని, దాన్ని పునరుద్ధరించాల్సిందిగా స్థానికులు మంత్రిని కోరడంతో ఎమ్మెల్యే నిధుల నుంచి రూ.15 లక్షలు మంజూరు చేశారు. గ్రామంలో మిగిలిన సమస్యలను దశల వారీగా పరిష్కరించనున్నట్టు భరోసానిచ్చారు. గ్రామంలో కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న సోమేశ్వరరావు ఇంటికి వెళ్లి, అతనికి పూర్తి స్థాయి వైద్య సేవలందించాల్సిందిగా అక్కడే ఉన్న వైదులను ఆదేశించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టి నాలుగేళ్లయిందని, అందులో రెండేళ్లు కరోనాతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడిందన్నారు. గ్రామాల్లో సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థల ద్వారా ప్రజల ముంగిటలకే సుపరిపాలన అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డికే ఖ్యాతి దక్కిందన్నారు.

వచ్చే ఏడాది జనవరి నుంచి పింఛన్‌దారులకు రూ.3 వేలు అందించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోందన్నారు. గత పరిపాలనతో సరిపోల్చుకుని, రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ప్రజల్ని అభ్యర్థించారు.

కార్యక్రమంలో భాగంగా స్థానికంగా రూ.59 లక్షలతో పూర్తి చేసిన పలు అభివృద్ధి పనులకు ఆయన ప్రారంభోత్సవం చేశారు. దర్జీనగర్‌లో రూ.19 లక్షలతో చేపట్టిన డ్రైనేజీ, బవులవాడలో రూ.10లక్షలతో చేపట్టిన సీసీ డ్రైనేజీ, రహదారి, రావుగోపాలరావుకాలనీలో రూ.20 లక్షలతో నిర్మించిన సీసీరోడ్డు, రూ.10 లక్షలతో ఏర్పాటు చేసిన ఇంటింటి కుళాయిలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, బవులవాడ సర్పంచ్ మజ్జి లక్ష్మి, పార్టీ నేతలు దాడి కుమార్, మజ్జి వెంకట అప్పారావు, బొద్దపు ప్రసాద్, నక్కా రమణ, శ్రీను, బుజ్జి, వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, పార్టీ అభిమానులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆర్బీకేలో ఇంటర్న్‌షిప్



కశింకోటలోని ఆర్బీకేలో ఇంటర్న్‌షిప్ పొందుతున్న బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థులు

కశింకోట: మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లో బీఎస్సీ అగ్రికల్చర్, ఒకేషనల్ కోర్సు విద్యార్థులు నలుగురు ఇంటర్న్‌షిప్ పూర్తి చేశారు. అనకాపల్లి ఏఎంఏఎల్ కళాశాలలో నూతనంగా ప్రవేశ పెట్టిన బీఎస్సీ అగ్రికల్చర్ కోర్సు చదువుతున్న విద్యార్థుల్లో ఇద్దరు కశింకోటలోని ప్రధాన రైతు భరోసా కేంద్రం (మండల వ్యవసాయ శాఖ కార్యాలయం)లోను, తాళ్లపాలెం, ఈ చౌడువాడలో ఒక్కొక్కరు వంతున తమ కోర్సులో భాగంగా మూడు నెలల పాటు శిక్షణ పొందారు. మంగళవారంతో వీరి శిక్షణ ముగిసింది. రైతు భరోసా కేంద్రాల పని తీరు గురించి, వివిధ రకాల పంటల సాగు, భూసార పరీక్షల నిర్వహణ, ఎరువులు, క్రిమిసంహారక మందుల వాడకం తదితర అంశాలపై మండల వ్యవసాయశాఖ అధికారి స్వప్న, ఏఈవో ఎ.శ్రీను, వ్యవసాయ సహాయకులు వీరికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ తమ ఇంటర్న్‌షిప్ విజయవంతంగా ముగిసిందని, తమకు తెలియని పలు అంశాలను ఆర్బీకేల్లో నేర్చుకున్నామన్నారు. ఈ ఇంటర్న్‌షిప్ తమ భవిష్యత్తుకు ఎంతగానో ఉపయోగపడుతుందని విద్యార్థులు దాసరి వెంకటలక్ష్మి, మామిడి సువర్ణ తెలిపారు. తమకు సహకరించి, అన్ని అంశాల్లో అవగాహన కల్పించిన అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

అల్లూరి, రోశయ్యలకు నివాళి



సీతారామరాజు, రోశయ్య చిత్రపటాల వద్ద నివాళులర్పించిన నరసింహమూర్తి

అనకాపల్లిటౌన్ : స్థానిక మెయిన్ రోడ్డు జూనియర్ కళాశాల ఆవరణలో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు, మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య జయంతి సందర్భంగా మంగళవారం వారి చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు భవన నిర్మాణ వ్యవస్థాపకులు పిరట్ల నరసింహమూర్తి మాట్లాడుతూ అల్లూరి, రోశయ్య జీవితాల గురించి వివరించారు. అనంతరం విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు కె.మోహనకృష్ణ, వై.చంద్రశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

కస్పావీధిలో 'గడప గడపకు' నేడు

కశింకోట: స్థానిక సచివాలయం-4 పరిధి కస్పావీధిలో బుధవారం ఉదయం 7 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఎంపీపీ కలగా లక్ష్మి, ఎంపీడీవో వి.వి.రవికుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ముఖ్య అతిథిగా హాజరై ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును ఆరా తీస్తారని పేర్కొన్నారు. స్థానిక సమస్యల్ని తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని వెల్లడించారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వైఎస్సార్ సీపీ శ్రేణులు తప్పక హాజరుకావాల్సిందిగా కోరారు.

గొలగాంలో 'గడప గడపకు' రేపు

అనకాపల్లిటౌన్: మండలంలోని గొలగాం గ్రామంలో గురువారం ఉదయం 7 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ గొర్లి సూరిబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ విచ్చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వశాఖల అధికారులు, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకావల్సిందిగా కోరారు.

'జగనన్న సురక్ష'లో ధ్రువపత్రాల పంపిణీ



లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందిస్తున్న దాడి రత్నాకర్

అనకాపల్లిటౌన్ : ప్రజల వద్దకే సుపరిపాలన తీసుకెళ్లే ఉద్దేశంతో ఏ రాష్ట్రంలో లేని విధంగా సచివాలయ, వలంటరీ వ్యవస్థలను స్థాపించి నూతన శకానికి నాంది పలికిన ఘనత సీఎం జగన్‌మోహన్ రెడ్డికే దక్కిందని వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ అన్నారు. స్థానిక గవరపాలెం 80వ వార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమ భాస్కర్ ఆధ్వర్యంలో 21, 23 సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం మంగళవారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యను నేరుగా తెలుసుకుని తక్షణమే పరిష్కరించేలా తమ ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు పార్టీలకు అతీతంగా అందించడమే లక్ష్యంగా పాలన సాగుతోందన్నారు. గత ప్రభుత్వాల మాదిరి లబ్ధిదారులు వ్యయప్రయాసలకు ఓర్చి కార్యాలయాల చుట్టూ తిరిగే ఇబ్బందులు తప్పాయన్నారు. దీనికి మనమంతా సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం కృతజ్ఞతలు తెలపాలన్నారు. అనంతరం జగనన్న సురక్ష కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్న 226 మందికి సర్టిఫికెట్లను అందించారు. కార్యక్రమంలో జెడ్సీ కె.వెంకటరమణ, డీటీ వై.శ్రీరామమూర్తి, పట్టణ సచివాలయాల కన్వీనర్ కొణతాల మురళీకృష్ణ, జీవీఎంసీ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శేఖర్, పార్టీ నేతలు మల్ల రాజా, కర్రి శివన్నారాయణ, శిలపరశెట్టి బాబి, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సబ్బవరం ఎంఈవో-1గా లక్ష్మణరావు



సబ్బవరం: సబ్బవరం మండల విద్యాశాఖాధికారి-1గా శ్యామల లక్ష్మణ రావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు మండల విద్యావనరుల కేంద్రంలో మండల విద్యాశాఖాధికారి-2 సత్యనారాయణమూర్తి మిగిలిన సిబ్బందితో కలిసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో విద్యాభివృద్ధికి మరింతగా కృషి చేస్తానన్నారు. విశాఖ రైల్వే న్యూకాలనీలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎంగా పనిచేస్తూ పదోన్నతిపై వచ్చారు.

అల్లూరికి ఘన నివాళి



కశింకోటలో అల్లూరి జయంతి సందర్భంగా యువకుల రక్తదానం

కశింకోట: కశింకోటలో మంగళవారం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు 125వ జయంతి వేడుకలు ఆసరా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సంతబయలలో ఉన్న అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సంతబయల సచివాలయ భవనంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించగా విశేష స్పందన లభించింది. సుమారు 125 మంది యువకులు ఉత్సాహంగా రక్తదానం చేశారు. సూర్య అభయాంజనేయ బ్లడ్ బ్యాంకు సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు.

రేపు పెంపుడు కుక్కలకు టీకాలు

సింహాచలం(పెందుర్తి): ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా గురువారం పెందుర్తి పశు వైద్యశాలలో కుక్కలకు ఉచితంగా టీకాలు వేయనున్నట్టు పశు వైద్యాధికారి డాక్టర్ జగన్‌మోహన్‌రావు మంగళవారం తెలిపారు. పెంపుడు కుక్కల యజమానులంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి న్యాయవాదుల ధర్నా



కోర్టు ముందు ధర్నా చేస్తున్న న్యాయవాదులు

తుమ్మపాల : అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఐఏఎల్ ఆధ్వర్యంలో న్యాయవాదులు మంగళవారం ధర్నా చేశారు. ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ రాష్ట్ర వ్యాప్తంగా ఇచ్చిన పిలుపు మేరకు పట్టణంలో న్యాయస్థానాల భవన సముదాయం ముందు బార్ అసోసియేషన్ ఆందోళన చేపట్టింది. ఈ సందర్భంగా ఐఏఎల్ జిల్లా ఉపాధ్యక్షుడు మళ్ల మాధవరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాయిలక్ష్మణ్ మాట్లాడుతూ కోర్టును అద్దె భవనంలో కాకుండా శాశ్వత భవనం నిర్మించి, తరలించాలన్నారు. న్యాయవాదుల రక్షణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేసి గూండాల పాశవిక దాడుల నుంచి న్యాయవాదులకు రక్షణ కల్పించాలని కోరారు. న్యాయవాదులు మరణిస్తే వారి కుటుంబాలకిచ్చే డెత్ ఫండ్ రూ.10 లక్షలకు పెంచాలన్నారు. న్యాయవాదుల సంక్షేమం కోసం రూ.100 కోట్లు విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు హరశ్రీనివాసరావు, ఎ.సుధాకర్, బాబు, ఎస్.శ్రీనివాసులు, నూకరాజు, సురేష్, రెడ్డి నాయుడు, ఆడారి శరత్, జి.రేణుకాదేవి, గోవింద్ పాల్గొన్నారు.

వరి విత్తనాల పంపిణీ



రైతులకు వరి విత్తనాలు అందజేస్తున్న సర్పంచ్ సాలాపు మీనా తదితరులు

సబ్బవరం: రైతు సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అనేక పథకాలు అమలు చేస్తున్నారని గొటివాడ సర్పంచ్ సాలాపు మీనా అన్నారు. రైతు భరోసా కేంద్రంలో రైతులకు వరి విత్తనాలను ఆమె మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సచివాలయం పరిధిలోని రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల కోసం మండల కేంద్రానికి వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. సోనామసూరి, సాంబామసూరి, శ్రీకాకుళం సన్నాలు తదితర రకాలు సుమారు 65 క్వింటాళ్ల రైతు భరోసా కేంద్రంలో పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఏఈవో బాలరాజు, పంచాయతీ కార్యదర్శి మహేంద్రరెడ్డి, వలంటీర్లు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



న్యాయ విశ్వవిద్యాలయం వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ రంగనాథం

సబ్బవరం: వాహన చోద కులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ అప్రమత్తంగా వ్యవహరించాలని సీఐ రంగనాథం సూచించారు. మండలంలోని పలు ప్రధాన కూడళ్లలో మంగవారం ఆయన విస్తృతంగా వాహన తనిఖీలను చేపట్టారు. వారి వద్ద ఉన్న రికార్డులను పరిశీలించారు. ట్రిపుల్ రైడింగ్, హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనాలు నడిపేవారు, మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై కేసులు నమోదు చేశారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీలు నిర్వహించిన వారిలో ఎస్ఐ ఎల్. సురేష్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

బాక్సింగ్ పోటీల్లో విద్యార్థి ప్రతిభ



నటరాజన్ మణికంఠన్ హరన్

పరవాడ: విజయవాడలో ఎన్టీఆర్ జిల్లా బాక్సింగ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన 5వ స్టేట్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ పాఠశాల 11వ తరగతి విద్యార్థి నటరాజన్ మణికంఠన్ హరన్ 80 కిలోల విభాగంలో బంగారు పతకం సాధించాడని పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్. సీతాలక్ష్మి చెప్పారు. ఈ నెల 8 నుంచి 14 వరకు అరుణాచల్‌ప్రదేశ్‌లో జరిగే జాతీయ బాక్సింగ్ ఛాంపియన్ షిప్‌కు ఎంపికయ్యాడని తెలిపారు. హరన్‌ను పాఠశాలలో మంగళవారం పాఠశాల డైరెక్టర్ పి.సూర్యనారాయణరెడ్డి అభినందించారు. సీఈవో కె. నిశాంత్, కోఆర్డినేటర్ రామలక్ష్మి, స్పోర్ట్స్ డైరెక్టర్ జి.మధుబాబు, కోచ్‌లు మనీష్, రమ్య, కృష్ణవేణి పాల్గొన్నారు.

హిందూ ధర్మ పరిరక్షణకు కృషి

మునగపాక : హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని సమరసత సేవా ఫౌండేషన్ సబ్‌డివిజన్ ధర్మ ప్రచారకుడు కొల్లి అప్పారావు కోరారు. మంగళవారం సంతబయిల రామాలయంలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించేందుకు గ్రామ ధార్మిక కమిటీలు అవసరమన్నారు. ప్రతి నెలా దేవాలయం కేంద్రంగా సామూహిక హారతి, ఏకాదశి నాడు నగర సంకీర్తన వంటి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ మండల కన్వీనర్ ఆడారి లక్ష్మణరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.